# ఇంకా దయ్యాల కథే!

"మిట్టమధ్యాహ్నం. మన కొంప, ఈ ఊడను కరుచుకొని ఉండకుండా ఎక్కడికి చచ్చింది పిల్లముండ?" మర్రి ఊడను పీకి పందిరేసినట్లు, మగదయ్యం భార్య దయ్యాన్ని అడిగింది.

"పిల్లముండట! కన్నకూతుర్ని ఇక్కడైనా ప్రేమగా పిలవలేవా?" భార్య దయ్యం భర్త దయ్యాన్ని చిరాకు అణచుకుంటూ అడిగింది.

భర్త ద్యయం మర్రి ఊడ ఎత్తూ ఎగురుతూ అంది:

"ప్రేమగా పిలిస్తే నెత్తికెక్కి తొక్కుతారు. ఇంతకూ అది ఎక్కడికి వెళ్ళింది?"

"నాకు తెలియదు", మొండిగా జవాబు చెప్పింది భార్య దయ్యం.

"బతికి ఉన్నరోజుల్లో అదేపాట. ఇప్పుడూ అదే. ఎదిగిన ఆడపిల్ల ఎక్కడికి వేళ్ళేదీ, ఎక్కడ నుంచి వచ్చేదీ తల్లులు చూసుకోరా? ఇంట్లో అంతకంటే చెలిగే దేముంది? మనం బతికి వున్న రోజుల్లో మన పక్కింటి సావిత్రి పిల్లల్ని ఎంతబాగా పెంచేది- క్రమశిక్షణలో? చదివించటమో! ఆహ్ ఏం మనిషి సావిత్రి!"

భర్త దయ్యం లొట్టలు వేసుకోవటం చూసి, భార్య దయ్యానికి గతం జ్ఞాపకానికి వచ్చి గొణిగింది:

"ఆఁ. ఎదురింటి వెంకట్రావు మాత్రం మీ కంటే అన్నిట్లో నయం".

"నువ్వు అసలు ఆడపుట్టుక పుట్టావా? పరాయి మగాణ్ణి ఇప్పటికీ తలుచుకొని చస్తున్నావు".

"మీరు పరాయి ఆడదాన్ని పొగడగా లేంది, నేను పరాయి మగాణ్ణి మాటవరసకు తలచుకుంటే తప్పా? నా ఖర్మగానీ, మీరొచ్చిన చోటికే నేనూ దయ్యమై రావాలా? ఈ బుజ్జీ ఇక్కడికే రావాలా? బతికి ఉన్నప్పటిగోలే. ఖర్మ! ఒకటే నస- బుజ్జి ఎక్కడికి వెళ్ళింది?

ఎక్కడికి వెళ్ళింది? అని. స్నేహితుల్ని పలకరించి వస్తానని ఆ పక్కకు వెళ్ళింది"

"ఆవేరే మతం వాళ్ళ శ్మశానానికా?" భర్త దయ్యం ఆశ్చర్యావేశాలతో అంది.

"అవును. పైగా ఇక్కడ చేదబావి కదా. నీళ్ళు అడుగంటాయి. అక్కడ పెద్ద దిగుడు బావి ఉందని చెప్పింది. ఈత నేర్చుకుంటోందట"

"పదిహేనేళ్ళ వయసొచ్చి ఈతనా?" మండిపడింది భర్త దయ్యం.

"నేను పద్దెనిమిదేండ్ల దాకా మా ఊళ్ళో ఈతకు వెళ్ళా."

"పెళ్ళికి ముందు నేను విన్నది నిజమే నన్నమాట. సిగ్గులేని వంశం", భర్త దయ్యం చిందులు తొక్కింది.

"ఇలా మాట్లాడే మగదయ్యాల మక్కెలు విరగగొట్టాలంటోంది, బుజ్జి. మీ చేతుల్లో, మీ వాళ్ళ చేతుల్లో పడరాని పాట్లు పడి నేనే ఆమాట అనలేకపోయాను, బతికి ఉన్న రోజుల్లో", భార్యదయ్యం దిగులుగా అంది.

"అని వుంటే తెలిసి వుండేది. పోనీ ఇప్పుడను చూద్దాం", మగదయ్యం ఛాలెంజి విసిరింది.

"మాతో ఎందుకు. ముందు మీ కొడుకు దయ్యం సంగతి చూసుకోండి. ఏం వెధవ పనులు చేసినా పట్టించుకోరు."

"వాడిది మగపుట్టుక. ఈ ఊడల మర్రి మీద కాపురమున్న దయ్యాలన్నింటికీ వాడంటే హడల్", భర్త దయ్యం గర్వంగా అంది.

"ఆఁ హడలే. ఆడవాళ్ళను గురించి వాడినోటి నిండా బూతులే. వాడి స్నేహితులు వీడికంటే రెండాకులు ఎక్కువ. అప్పటి రాతలు మాత్రం! బుజ్జిని అంటారు మాటిమాటికీ. అది నాలాగా పడి వుండేరకం కాదు".

భర్త దయ్యం "హూఁ" అంది.

☆ ☆ ☆

పని మనిషి ఇంట్లోకి వచ్చీ రాగానే దుర్గతో అంది :

"అమ్మా! మన నయనమ్మకు సదువు సెపుతుందే ఆ యమ్మకు దయ్యం పట్టింది'"

"నీకెప్పుడూ దయ్యాలూ గియ్యాలే", దుర్గ నవ్వుతూ కొట్టి పారవేసింది.

"నిజమమ్మా. నేను చూశా గదా?" అని నమ్మబలికింది పనిమనిషి.

"అట్లానా? ఏమైంది పాపం? డాక్టరుకు చూపించలేదా?," అడిగింది దుర్గ.

"ఏమోనమ్మా. డాక్టర్లు ఏం చేస్తారమ్మా? - వీటికి. డబ్బు పీకి ఏంలేదు అన్నారంట. నేంజూశా. ఏమిటేమిటో మాట్లాడతాదమ్మా- ఆయమ్మ. ఇంగిలీసు, తురకం, ఇంకా ఏదో బాస మాట్లాడుతాంది", అంది పనిమనిషి.

"హైదరాబాదులో చదువుకున్న వాళ్ళకు ఇంగ్లీషు, ఉర్దూ వస్తాయికదా మంగా? ఆ అమ్మాయి ఎం.ఎ. చదువుకుంది," నవ్వుతూ దుర్గ అంది.

"విన్నోళ్ళు అన్నారమ్మా. ఏదో అరవం, మరాటి, పెంచి అంట"

"ఫ్రెంచా?" విరగబడి నవ్వింది.

మంగ ఆ నవ్వులో శ్రుతి కలుపుతూ అంది.

"మా బస్తీలో వుండే దయ్యాల సుబ్బయ్యకు చూపించమని చెప్పా".

చందమామలోని దయ్యం కధ అప్పుడే పూర్తి చేసిన దుర్గ కూతురు నయన అడిగింది

"ఆడవాళ్ళకే దయ్యాలు పడతాయెందు కమ్మా?"

"నువ్వు నోరుమూసుకో, ఏం విందామా అని చెవులు తెరిచి పెట్టకొని వుంటావు." దుర్గ కూతురిని మందలించింది.

"అది కాదమ్మా, ఈ చందమామ కథ ఉందే ఈ కథలో దయ్యాలు మంచివే. ఎవరో అమ్మాయికి ఒక ఆడదయ్యం పడుతుంది." నయన సంజాయిషీ చెప్పింది.

"నయనమ్మా! మీ టూసనమ్మకు పట్టింది ఆడ దయ్యమే"

"ఇదిగో మంగా చాల్లే ఊరుకో", దుర్గ పనిమనిషిని మందలించింది.

నయన ఆలోచనలో పడింది. నిజానికి తల్లితో మంగ చెప్పిందంతా నయన వినినే వింది. వారం దినాలుగా ట్యూషన్ లేకపోవటమూ, ఆ అక్కకేదో జబ్బు వుందని చెప్పటమూ తనకు తెలిసిందే. ఒకటి రెండు మార్లు తను వెళ్ళి పలకరించింది. పిచ్చి చూపులు చూసిందే కానీ, మాట్లాడలేదు.

వీధిలో ఏవో కేకలు విన్పించాయి. పరుగులు పెడుతూ ఎవరో అరుస్తున్నారు. "పొగ వస్తోంది. . . ఆ ఏడుపు. . .ఎవరో కాల్చుకున్నట్లుంది . . . తలుపులు బద్దలు కొట్టండి"

మంగ తోమే అంట్లను పక్కన బెట్టి వీధిలోకి పరుగెత్తింది. తల్లి "వద్దు వద్దు నువ్వు పోవద్దు" అంటున్నా, నయన మంగ వెంట పరుగు తీసింది.

రెండిళ్ళవతల జరిగిన ఘోరం.. ఒళ్లంతా కాలి కమురువాసనతో, వికృతమైన ముఖంతో విలవిలలాడిపోతున్న తమ ట్యూషన్ టీచరు ఆ 'అక్క'ను దుప్పటి చుట్టి ఆటోలో ఎవరో తీసుకువెళుతున్నారు.

నయన చూసింది. భయపడిపోయింది. వణుకు వచ్చింది. ఏడుపొచ్చింది. పక్కనే వున్న ఒకరిద్దరు స్నేహితురాళ్ళు నయన పక్క చేరారు. వెక్కిళ్ళు బయటికి విన్పించకుండా అణచుకొని కళ్ళు తుడుచుకున్నారు. ఏడుపుగొంతుల్తో వాళ్ళు మాట్లాడుకున్నారు. నయన బాధ మరింత పెరిగింది.

మంగా, నయన ఇంట్లోకి వస్తూనే దుర్గ అంది.

"ఇదుగో నయనా.. ముందు ముఖం కడుక్కొని క్లాసుపుస్తకాలు పట్టుకో."

నయన ముఖం కడుక్కొని, క్లాసు పుస్తకాలైతే పట్టుకుంది.

చెవిలో అడిగినట్లు దుర్గ రహస్యంగా మంగను అడిగింది:

"ఏం జరిగింది?"

"అదేనమ్మా... గోరం నేనిందాకా చెప్పానే. ఆయమ్మ కాల్చుకుంది. ఇంట్లో ఎవరూ లేంది చూసుకొని. గోరమమ్మా గోరం. ముప్పయేండ్ల ప్రాయం. పెళ్ళికాలేదు పాపం. దయ్యం పట్టినోళ్ళను ఒంటరిగా వదిలి పెట్టకూడదమ్మా... బతికేటట్లు లేదు.. ఆయమ్మతో దయ్యం అనిందంట 'కాల్చుకుంటానా' అని....' మంగ ఇంకా చెప్పబోతోంది.

కళ్ళుచేసుకొని తమవైపే చూస్తున్న కూతురు నయనను దుర్గ చూసింది.

వెక్కిళ్ళు పెడుతూ నయన ఏడ్వసాగింది. తమ ట్యూషన్ టీచర్ - ఆ అక్క - ఎందుకు చనిపోయిందో నయనకు తెలుసు.

☆ ☆ ☆

ఆ రాత్రి

ఆడపిల్ల దయ్యం నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

తండ్రి దయ్యం మండి పడింది.

"ఆ ఏడ్పు ఆపు. నిన్నెవడు అడ్డం వచ్చినట్లు తిరగమన్నాడు ఆడ దయ్యాలకు హద్దూ పద్దూ వుండాలి".

ఆడపిల్ల దయ్యం తండ్రి దయ్యాన్ని చూసింది. ఆ పక్కన్నే పళ్ళికిలిస్తున్న సోదర దయ్యాన్ని చూసింది. కోపం ఆపుకోలేకపోయి అరిచింది:

"హద్దూ పద్దూ.. ఎప్పుడూ అవి మాకేనా. మీకు అక్కరలేదా? అదుగో ఇప్పుడే వచ్చిన ఆ కొత్త దయ్యం కథ వినండి తెలుస్తుంది బండారం..."

"ఏం బండారం? స్వేచ్ఛ, స్వేచ్ఛ అనే మీ బండారమా?" సోదర దయ్యం చెణికింది. లొట్టలువేస్తూ మరొక మాట అంది : "ఈ కొత్త దయ్యం చూడ్డానికి బాగుంది. మావాడేలే పట్టింది ఆదయ్యంపట్టు."

ఆడపిల్ల దయ్యం ఆవేశం ఆపుకోలేకపోయింది. సోదర దయ్యం మూతి మీద ఒక గుద్దుగుద్దింది.

"పోరా.. మీ మగదయ్యాల బుద్ధి మాకు తెలియందికాదు... పాపం ఆ అక్క దయ్యానికే తెలియకపోయింది"

ఆవేశంలో ఆ మాటలు అనన్నైతే అందికానీ, ఆడపిల్ల దయ్యానికి దుఃఖం ఆగలేదు- ఊడల మర్రిలో వున్న ఆడదయ్యాల కథలు తలచుకుంటున్నకొద్దీ,ఆవేశమూ ఆగలేదు. ○

**● 6 సెప్టెంబరు 1995, ఆకాశవాణి, హైదరాబాద్ ●**